క్లుప్తంగా

31న జాబ్‌మేళా

చిట్టమూరు: స్థానిక సచివాలయం, మల్లాం సచివాలయం–2లో 31న మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు. 5వ తరగతి నుంచి బీటెక్ వరకు చదివిన యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. జాబ్‌మేళాలో నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో ఉన్న పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు తమ విద్యా సర్టిఫికెట్‌లతో పాటు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు, బయోడేటా తీసుకురావాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం అర్హతను బట్టి రూ.11,500 నుంచి, 13,500 వరకు ఉంటుందన్నారు. అలాగే ఉచిత రవాణా సౌకర్యంతో పాటు, హాస్టల్ వసతి కూడా కల్పిస్తారన్నారు. ఈ జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసు కోవాలని ఆయన కోరారు.

అభ్యర్థులు హాజరుకండి

గూడూరు: డివిజన్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూల నిమిత్తం ఈనెల 31వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయానికి హాజరుకావాలని ఐసీడీఎస్ సీడీపీఓ మెహబూబ శనివారం ఓ ప్రకటనలో కోరారు. గూడూరు అర్బన్, రూరల్, కోట, వెంకటగిరి ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న కార్యకర్త, ఆయా పోస్టులకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారని, ఈ మేరకు ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

పాత డంపింగ్ యార్డును తీర్చిదిద్దుతాం



నూతన డంపింగ్ యార్డులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్

గూడూరు: పాత డంపింగ్ యార్డు నుంచి చెత్తను కొత్త డంపింగ్ యార్డుకు తరలించి, పాత డంపింగ్ యార్డులో మొక్కలు నాటి, సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్ పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని తాళమ్మ దేవాలయం వెళ్లే మార్గం ఎదుట ఉన్న పాత డంపింగ్ యార్డు సమీపంలో ప్రభుత్వం కేటాయించిన నూతన డంపింగ్ యార్డులో శనివారం ఆయన జంగిల్ క్లియరెన్స్ చేయించే దిశగా చర్యలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గతంలోని డంపింగ్ యార్డులోని చెత్త సమీపంలోని రోడ్డు మార్జిన్‌లోకి వస్తూ, ఆ మార్గం గుండా వెళ్లే వారికి తీవ్ర అసౌకర్యం కల్గిస్తోందన్నారు. ఈ మేరకు నూతనంగా డంపిగ్ యార్డుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించారన్నారు. దీంతో ఆ స్థలంలో చెట్లు, చెత్తచెదారాలను తొలగించే దిశగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అలాగే త్వరలో బయో మైనింగ్ కూడా ప్రారంభించనున్నామని ఆయన తెలిపారు.

చెరువుల వేలం పాట

వెంకటగిరి: మున్సిపాలిటీ పరిధిలోని అమ్మవారిపేట, కుమ్మరిగుంట, చెవిరెడ్డిపల్లి, ధర్మాపురం, పెరియవరం, మరాటపల్లి, పోలిశెట్టిగుంట, మనులాలపేట చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కుకు సంబంధించి ఈనెల 31న వేలం పాటలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ. 5వేల ధరావత్తు చెల్లించి మున్సిపల్ కార్యాలయంలో 31న ఉదయం 11.30 గంటలకు నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని తెలియజేశారు.

పథకాలు క్షేత్రస్థాయిలో అందేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాతు రామకృష్ణ

వాకాడు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందేలా అధికారులు చూడాలని వాకాడు మండల జెడ్పీటీసీ సభ్యుడు రాతు రామకృష్ణ అన్నారు. శనివారం వాకాడు వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఎంపీపీ కొడవలూరు అనుసూయమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు రాతు రామకృష్ణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరేలా ఆయా శాఖ అధికారులు పనిచేయాలన్నారు. అలాగే పొదుపు గ్రూపుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల బోధనపై విద్యాశాఖాధికారులుపర్యవేక్షణ ఉండాలన్నారు. వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఎంపీడీఓ గోపీనాథ్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సారంగపాణి, ఏఎంసీ చైర్మన్ వాకాటి నాగభూషణమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, వెంకటరత్నం, మధురెడ్డి పాల్గొన్నారు.

దినకరా..శుభకర

సప్తవాహనాలపైన విహరించిన లక్ష్మీనరసింహుడు

- వేడుకగా రథసప్తమి
- మారుమోగిన గోవింద.. గోవిందా నామస్మరణ



రాపూరు: సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న నరసింహస్వామి

రాపూరు: పెంచలకోనలో శనివారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏడు వాహనాలపై ఊరేగుతూ శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి తన దివ్వ మంగళరూప దర్శనభాగ్యాన్ని భక్తులకు ప్రసాదించారు. పెంచలకోన క్షేత్రం గోవిందనామ స్మరణతో మారుమోగింది, రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్ష్మీనరసింహస్వామికి ఉదయం 4గంటలకు శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, 7 గంటలకు శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని సూర్యప్రభవాహనంపై కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. 9గంటలకు స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవతల ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపైన కొలువు దీర్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. 11 గంటలకు లక్ష్మీనరసింహుడిని సింహవాహనంపైనా 1 గంటకు శ్రీవారిని స్వర్ణ (బంగారు) గరుడవాహనంపైన ఉంచి కోన తిరువీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు సుదర్శన చక్రానికి పుష్కరిణిలో చక్రస్నానం చేయించారు. 5 గంటలకు బంగారు హనుమంతవాహనం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామిని ,సాయంత్రం 6గంటలకు అశ్వవాహనంపైనా రాత్రి 7 గంటలకు చంద్రప్రభవాహనంపైన కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

గూడూరు: రథసప్తమి పర్వదినాన్ని శనివారం నియోజవర్గ ప్రజలు అంత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే లేచి, తలపై జిల్లేడు, రేగిపండ్లు పెట్టుకుని స్నానాలాచరించారు. అనంతరం సూర్యభగవానునికి నైవేద్యాలు సమర్పించారు. రాజావీధిలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై పల్లకీసేవ నిర్వహించారు. అలాగే అలఘనాథస్వామి ఆలయంలోనూ, చెన్నకేశవస్వామి ఆలయంలోనూ స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. స్థానిక సాయి సత్సంగ నిలయంలో అమ్మవారికి విశేషాలంకరణ నిర్వహంచారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివార్లను, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సైదాపురం: కృష్ణారెడ్డిపల్లిలో వెలసిన మహావిష్ణువు ఆలయంలో శనివారం రథసప్తమి పర్వదినాన్ని పురష్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహా విష్ణుమూర్తి దివ్య మంగళరూప దర్శన భాగ్యాన్ని భక్తులకు ప్రసాదించి కటాక్షించారు.

సూర్యప్రభ వాహనంపై పాండురంగడు..

సూళ్లూరుపేట: పట్టణంలోని రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని దేవేరులతో సూర్యప్రభ వాహనం గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.



రాపూరు: గరుడవాహనంపై ఊరేగుతున్న నృసింహుడు



రాపూరు: పుష్కరిణిలో చక్రస్నానం

వేడుకగా రథసప్తమి వేడుకలు...

డక్కిలి: డక్కిలిలో వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తుల గోవింద..గోవిందా నామస్మరణతో మార్మోగింది. రథసప్తమి పురష్కరించుకుని ఆలయంలో నేత్రపర్వంగా ఉదయం ప్రత్యేక పూజలు ,అభిషేకలు జరిగాయి. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీదేవి, భూదేవి ప్రసన్న వేంకటేశ్వరస్వామి పల్లకీ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

కోలాహలంగా రథసప్తమి

చిల్లకూరు: కలవకొండ గ్రామంలో వెలసియున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మిలకు ఉదయం అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి, ఉత్సవర్లను ప్రత్యేక అలంకరణలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



పల్లకీ సేవలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



డక్కిలి: పల్లకిపై విహరిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి



చిల్లకూరు: ప్రత్యేక అలంకరణలో స్వామిఅమ్మవార్లు

సంక్షేమ పథకాలతో సరికొత్త చరిత్ర

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేటటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను గడప గడపకు తీసుకెళుతూ, సంక్షేమ పథకాల అమల్లో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. పూడేరు సచివాలయం పరిధిలోని అరవపెరిమిడి పంచాయతీలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఎమ్మెల్యే సారథ్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఘనస్వాగతం లభించింది. గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందించారు. గ్రామంలో రూ.36 లక్షలతో జలజీవన్ మిషన్ పథకానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ రెడ్డాం వీరశంకర్, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ టి. సుబ్రహ్మణ్యం రెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి, నేతలు కె.రాజారెడ్డి, ఓ. కిషోర్ యాదవ్, కె. జయరామయ్య, పిలాస మణి, దారా రవి, కే అశోక్‌కుమార్, పుదూరు సర్పంచ్ సుమతి, కోఆప్షన్ సభ్యులు గరిబ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ

దొరవారిసత్రం: దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా ఉండాలంటే వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డీవీ సత్రం వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. దళారుల మోసాలపై శనివారం సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నేతలు వైస్ ఎంపీపీ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రస్తుతం వివిధ గ్రామాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. సివిల్ సప్లయిస్, తూనికలు, కొలతల శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో దళారుల చేతిల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. దళారులు ఇష్టారాజ్యంగా ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసి మిల్లర్లకు అధిక మొత్తంలో అమ్మి సొమ్ముచేసుకుంటారని వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి మద్దతు ధరలు ప్రకటించడమేకాకుండా వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చెయ్యకుంటే రైతు శ్రమకు తగిన ఫలితం దక్కకుండాపోతుందన్నారు. సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, గోపిరెడ్డి, మధురెడ్డి, నాయకులు వెంకటరమణయ్య, భాస్కర్‌రెడ్డి, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, మౌళ ఉన్నారు.

కో-ఆప్షన్ సభ్యుని ఎంపికకు నోటిఫికేషన్

చిల్లకూరు: మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుని ఎంపికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శనివారం ఎంపీడీఓ విష్ణుచిరంజీవి విడుదల చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నట్లు ఆయన శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో గతంలో ఎంపీటీసీలు అందరూ వల్లిపేడుకు చెందిన షేక్ అమీర్ బాషాను కో–ఆప్షన్ సభ్యునిగా ఎంపిక చేశారు. అయితే ఆయన అకాల మరణం పొందడంతో మరోసారి కోఆప్షన్ సభ్యుడిని ఎంపిక చేయాల్సి వచ్చింది. దీంతో ఎన్నికల అధికారుల ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఫిబ్రవరి 3వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించి కోఆప్షన్ సభ్యుడిని ఎంపిక చేస్తామని, ఇందుకుగాను ఈనెల 30వ తేదీలోగా ఫారం -2 ఎన్నికల నోటీసును జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

సత్కారం



ఎంఈఓను సన్మానిస్తున్న ఎంపీపీ, ఉద్యోగులు

డక్కిలి: ఉత్తమ అవార్డును అందుకున్న డక్కిలి ఎంఈఓ కె.వెంకటేశ్వర్లును స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంపీపీ గోను రాజశేఖర్, వెంకటేశ్వరపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎండీ పెంచలయ్యతో పాటు పలువురు ఉద్యోగులు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఎంఈఓ వెంకటేశ్వర్లు విద్యాశాఖకు సంబంధించి అందించిన సేవలను గుర్తించి అధికారులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డును ప్రదానం చేశారన్నారు. డక్కిలి హైస్కూల్ హెచ్ఎం ఎస్ సుబ్రమణ్యం, మండల పరిషత్ సూపరిండింటెంట్ అనురాధ, సీనియర్ అసిస్టెంట్ సిరాజ్ ఉద్దీన్ ఖాదిరి, ఈఓపీఆర్డీ వెంకటాద్రి, పంచాయతీ కార్యదర్శులు పెంచల నరసింహులు, పి.ఏడుకొండలు, ఉపాధ్యాయులు మాల్యాద్రి, తేజవర్మ పాల్గొన్నారు.



ఈఈ ఇస్మాయిల్‌ను సత్కరిస్తున్న డీఈఈ

గూడూరు: ఏపీఎస్‌పీడీసీఎల్‌లో విశిష్ట సేవలందజేసిన ఈఈ ఇస్మాయిల్ అహ్మద్, డీఈఈ ప్రసాద్‌లను శనివారం ఘనంగా సత్కరించారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా ఈఈ, డీఈఈలు రిపబ్లిక్ దినోత్సవం రోజున అవార్డును అందుకున్నారు. ఈఈ కార్యాలయంలో శనివారం ఆ శాఖ ఏఈలు, సిబ్బంది సత్కరించారు.



ఎంఈఓను సత్కరిస్తున్న సిబ్బంది

చిట్టమూరు: చిట్టమూరు ఎంఈఓ బీవీ కృష్ణయ్యను కార్యాలయ సిబ్బంది శనివారం సత్కరించారు. ఉత్తమ ఎంఈఓగా అవార్డు తీసుకున్న సందర్భంగా కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యాలయంలో విద్యా శాఖ కార్యాలయ సిబ్బంది నాగరత్నమ్మ, రవీంద్ర, సునీత, వాణి పాల్గొన్నారు.

సులభ రీతిలో బోధన చేయాలి

డక్కిలి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సులభరీతిలో బోధన చేయాలని ఎంఈఓ కె. వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. దేవులపల్లి మెయిన్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరుపట్టి, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందేలా బోధించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం నాణ్యతతో అందించాలని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కింద అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. హెచ్ఎం శైలజ ఉన్నారు.

సకాలంలో రికవరీలు పూర్తిచేయాలి

వెంకటగిరిరూరల్: బ్యాంకుల ద్వారా పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో బ్యాంకులకు చెల్లించేందుకు సీసీలు ప్రత్యేక దృష్టి సారించాలని ఏరియా కో–ఆర్డినేటర్ ఆదినారాయణ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల ఏపీఎంలు, సీసీలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ, జేటీ, స్త్రీనిధి, ఉన్నతి, పీఎంజేజేబీవై, చేయూతపై వారానికి ఒకసారి రిపోర్టు అందజేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు, బ్యాంకు రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా అధికారులు చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఎంపీఎంలు జమున, పోలమ్మ, నరసింహులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

గూడూరురూరల్: నిమ్మ సాగులో యాజమాన్య పద్ధతులపై ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెడిచెర్ల ఎస్సీ కాలనీలో శనివారం రైతులకు సాగులో మెలకువలు, ఆధునిక పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఫౌండేషన్ జిల్లా అభివృద్ధి అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ శిక్షణ పొందిన రైతులకు నిమ్మ పంటలో ఎండు కొమ్మలు కత్తిరించుకునేందుకు సర్పంచ్ పెంచలయ్య చేతుల మీదుగా కత్తెర్లను పంపిణీ చేశామని చెప్పారు. అదేవిధంగా వర్మీకంపోస్ట్ తయారు చేసుకోవడానికి కూడా రైతులకు వర్మీ యూనిట్లు అందించినట్లు తెలిపారు. కమ్యూనిటీ ఫెసిలిటేటర్లు మస్తానమ్మ, మస్తానయ్య, గోపాల్ పాల్గొన్నారు.

శరవేగంగా పక్కా ఇళ్ల నిర్మాణాలు

చిల్లకూరు: ఉగాదికి పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశాలతో మండలంలో పక్కా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేశారు. శనివారం మండలంలోని ఓడూరు గ్రామంలోని లేఔట్‌లో 46 మంది లబ్ధిదారులకు పక్కా ఇల్లు మంజూరు కాగా 25 మంది లబ్ధిదారులు పనులు చేపట్టేలా గృహ నిర్మాణ శాఖాధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల మండల స్థాయి అధికారులు గ్రామంలోని లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. దీంతో లబ్ధిదారులు నిర్మాణాలను చేపట్టేందుకు ముందుకురావడంతో పనులు వేగం పుంజుకున్నాయి. లబ్ధిదారులు నిర్మిస్తున్న పక్కా గృహాలను హౌసింగ్ ఏఈ అహ్మద్‌బాషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ మదురిమలు పర్యవేక్షించి లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంట్ కమ్మీలను ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థులతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- ముఖ్యఅతిథిగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శనివారం 1991–95, 1992–96 బ్యాచ్ బీటెక్ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్, స్టేట్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన ఎన్‌బీకేఆర్ పూర్వ విద్యార్థులు పాల్గొని ఆనాటి మధుర స్మృతులను తమ ప్రసంగాల్లో గుర్తు చేసుకున్నారు. ఒక్కసారి చిన్నపిల్లలుగా మారి తాము చేసిన అల్లరి, చిలిపి చేష్టలను గుర్తు చేసుకుని ఆనందంలో మునిగిపోయారు. అప్పటి తమ గురువులు ప్రొఫెసర్ కేవీ రెడ్డి, ప్రభాకర్‌రావు, సాయిరామ్, నాగభూషణం, కేఆర్‌కే ప్రసాద్‌లను సన్మానించుకుని గురుభక్తిని చాటారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నామన్నారు. ఇంతమంది గొప్పగొప్ప స్థానాల్లో ఉన్నారంటే కళాశాలలో నేర్చుకున్న క్రమశిక్షణ, అధ్యాపకులే కారణమని నేదురుమల్లి ఈ సందర్భంగా అన్నారు. అనంతరం పూర్వవిద్యార్థులు రామ్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటా



పార్టీ శ్రేణులతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడే ప్రతి కార్యకర్త, నాయకులకు తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గం సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వాకాడులోని ఆయన స్వగృహంలో వెంకటగిరి నియోజకవర్గంలోని పలు మండలాల నేతలు, కార్యకర్తలు రామ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు రానున్న ఎన్నికల్లో అందరూ సమన్వయంతో కలిసి పనిచేసి జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుని ప్రజా అభివృద్ధికి కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లో పార్టీ శ్రేణుల మధ్య చిన్నచిన్న మనస్పర్థలు విడినాడి అందరూ కలిసి వందశాతం ఫలితాలు సాధించే దిశగా కష్టపడాలన్నారు. మనమంతా సీఎం సైనికులమని చెప్పారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానని, అవసరమైతే సీఎం దృష్టికి తీసుకెళతానన్నారు.

వైఎస్ విగ్రహానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న నేతలు

రాపూరు: రాపూరులో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ పునఃనిర్మాణానికి స్థలాన్ని శనివారం పరిశీలించామని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి దందోలు నారాయణరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో జాతీయ రహదారి నిర్మాణం చేపట్టడంతో రోడ్డుపై ఉన్న వైఎస్ విగ్రహాన్ని తొలగించారని అప్పటి నుంచి గ్రంథాలయం వద్ద ఉంచారని ప్రస్తుతం సమీపంలోనే విగ్రహం పునఃనిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. నేతలు దయకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నరసింహారెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, మధురెడ్డి, సుబ్బారెడ్డి, రమణయ్య, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు

దొరవారిసత్రం: తీరగ్రామాలైన కారికాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం తొగరాముడి పీహెచ్‌సీ డాక్టర్ తరుణ్‌సాయి విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల శుభ్రత వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం సతీష్, వైద్యసిబ్బంది రాజకుమారి, సబిత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి బీపీ పరికరాలు

గూడూరు: స్థానిక ఏరియా ఆస్పత్రికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం 4 బీపీ ఆపరేట్ పరికరాలను, వైద్యులకు సీనియర్ రొటేరియన్ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కిరణ్‌చక్రవర్తి, దశరథరామిరెడ్డి, పీవీ కృష్ణయ్య, ఎన్వీరత్నం, శ్యాంయాదవ్ ఇఇచార్జి సూపరింటెండెంట్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తడ: మండలంలోని కారిజాత గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసులు చేసిన దాడిలో ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాలు.. అందిన సమాచారం మేరకు సూళ్లూరుపేట ఎస్ఐ రవిబాబు, ఇతర సిబ్బందితో కలిసి ఓ ఇంటిపై అర్ధరాత్రి సమయంలో దాడి చేశారు. తొమ్మిది మంది జూదగాళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 12,914 రూపాయలు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.